క్లుప్తంగా

ఉచిత కంటి వైద్య శిబిరం



ఊట్కూరు: మండలంలోని చిన్నపొర్లలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కంటి శిబిరం ఆదివారం విజయవంతమైంది. శంకర కంటి ఆస్పత్రి హైదరాబాద్‌వారి వైద్యబృందంచే కంటి శిబిరం నిర్వహించారు. పెద్దపొర్ల, చిన్నపొర్ల, మల్లెపల్లి, ఎడివెల్లి గ్రామాల నుంచి వచ్చిన రోగులకు కంటి పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు, కంటి అద్దాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రవీందర్‌రెడ్డి, డా సాయిశ్రీ,, డా ఆదిత్య, డైరెక్టర్ బాలాజి, పార్వతి, రాజశేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సూచిక బోర్డు ఏర్పాటు చేయాలి



మాగనూర్: మండల పరిధిలోని వాడ్వట్ నుంచి మందిపల్లికి వెళ్లే రహదారిలో మలుపులు ప్రమాదకరంగా ఉండటంతో నిత్యం వాహనదారులు ప్రమాదానికి గురవుతున్నారు. ఈ దారిలో కనీసం సూచిక బోర్డులు ఏర్పాటుచేయకపోవడంతో మలుపు వద్ద ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతంలో రైతులకు అధికారులు సరైన అవగాహన కల్పించకపోవడంతో ఎక్కడబడితే అక్కడ రోడ్డును తవ్వేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మలుపువద్ద సూచిక బోర్డులతోపాటు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటుచేయాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

ప్రమాదకర బావిని పూడ్చాలి..



మాగనూర్: మండల పరిధిలోని పర్మన్‌దొడ్డిలో గ్రామ మధ్యలో ప్రధాన రహదారి పక్కన ఓ పురాతన బావి ప్రమాదకరంగా ఉంది. బావి చుట్టు ముళ్లపొదలు, చెత్తచెదారం పేరుకుపోవడంతో బావి ఉన్నట్లు గుర్తించడానికి అవకాశం లేకుండా ఉందని గ్రామస్తులు అంటున్నారు. దీంతో మూగజీవాలు, చిన్నారులు ప్రమాదానికి గురయ్యే అవకాశాలున్నాయని, సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదకర బావిని పూడ్చివేయాలని కోరుతున్నారు.

సొంత నిధులతో మట్టిరోడ్డు నిర్మాణం



కృష్ణా: మండలంలోని మురారిదొడ్డి గ్రామానికి సరైన రహదారి లేక వాహనదారులు పడుతున్న ఇబ్బందులను గమనించిన అదేగ్రామానికి చెందిన బాబు తనసొంత నిధులతో మట్టి రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఆదివారం గ్రామం నుంచి మూడుమాల్ బీటీ రోడ్డు వరకు మొరం వేయించి డోజర్‌తో సరిచేయించి ప్రయాణికుల, వాహనదారుల కష్టాలు తీర్చారు. దీంతో పలువురు గ్రామస్తులు ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

మురుగు కాల్వలు నిర్మించాలి



మాగనూర్: మండల పరిధిలోని కొత్తపల్లిలో ప్రధాన రహదారికి ఇరువైపులా మురుగు కాల్వలు లేక గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. దీంతో ఇళ్లలోకి దుర్వాసన వస్తుందని, ఇంటి ఆవరణలో కూర్చోలేని పరిస్థితి నెలకొందని అంటున్నారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి మురుగు కాల్వల నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

చట్టాలపై అవగాహన

దేవరకద్ర రూరల్: వ్యవసాయ రంగానికి సంబంధించి లీగల్ చట్టాలపై రైతులకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఏఓ అగర్వాల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా న్యాయమూర్తితో పాటు, సంబధిత న్యాయవాదులు హాజరవుతారని, రైతులు ఈ సదస్సులో పాల్గొని సందేహాలను నివృత్తి చేసుకోవాలని కోరారు.

విద్యార్థుల కష్టాలు పట్టవా?

- చదువుకునేందుకు పాట్లు
- బస్సు సమయంలో ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యం



ప్లాట్‌ఫాం మీద నిల్చున్న కంసాన్‌పల్లి బస్సు

నారాయణపేట రూరల్: జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలోని ఈ రెండు గ్రామాల విద్యార్థులు చదువుకోవాలంటే ఉదయాన్నే బస్సు ఎక్కి చీకటి పడ్డాకే ఇంటికి రావాలి. ఎందుకంటే మన ఆర్టీసీ అధికారులు రూపొందించిన సమయం అలాంటిది. వివరాల్లోకి వెళ్తే.. దామరగిద్ద మండలం కంసాన్‌పల్లి, నారాయణపేట మండలం బొమ్మన్‌పాడు గ్రామాలకు చెందిన విద్యార్థులు జిల్లా కేంద్రంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల, కళాశాలలకు చదువుకునేందుకు వస్తుంటారు. అయితే ఈ గ్రామాలకు ఆర్టీసీ అధికారులు ఒక ట్రిప్పు పిల్లల బస్సును ఏర్పాటు చేశారు. అయితే అది ఉదయం 6:45కు వచ్చి పిల్లలతో 7గంటలకు గ్రామంలో బయలుదేరాలని సమయాన్ని రూపొందించారు. 9గంటల తర్వాత గాని విద్యాసంస్థలు ప్రారంభం అవుతున్నా 7:45లోపు పట్టణానికి బస్సు వచ్చేస్తుంది. ఇక సాయంత్రం పిల్లలకు 4:30గంటలకు విద్యాసంస్థలు వదిలినా సాయంత్రం 6గంటల తర్వాత గాని బస్టాండ్‌లో బస్సు ఫ్లాట్ ఫామ్‌కు చేరుకోదు. దీంతో ఉదయం సాయంత్రం గంటన్నర చొప్పున మొత్తం మూడు గంటలు బస్టాండ్‌లో చిన్నారులు పడిగాపులు కాయాల్సిన దుస్థితి నెలకొంది. ఎన్నిసార్లు ఆర్టీసీ డీఎంకు విన్నవించినా ఫలితం మాత్రం లేకుండా పోయిందని పలువురు వాపోతున్నారు. విద్యార్థి సంఘాలు వినతిపత్రాలు అందించినా స్పందించడం లేదని విమర్శిస్తున్నారు. ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యంతో చాలామంది ఆడపిల్లలు చదువు మధ్యలో మానేస్తున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా డీఎం స్పందించి సమయాన్ని మార్పు చేయాలని కోరుతున్నారు.

సమయాన్ని మార్చాలి..



కంసాన్‌పల్లి, బొమ్మన్‌పాడు గ్రామాల్లో ఉదయం 7గంటలకు బస్సు ఎక్కి రాత్రి 7గంటలకు ఇంటికి రావడం విద్యార్థులకు ఇబ్బందికరంగా ఉంది. గతంలో ఎన్నిసార్లు డిపో మేనేజర్‌కు విన్నవించినా ఫలితంగా లేకుండా పోయింది. విద్యార్థుల బస్సుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదు. వెంటనే సమయాన్ని మార్పు చేయాలి.

– నరహరి, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి

కొత్త బస్సులు వస్తే పరిశీలిస్తాం..



ప్రస్తుతం డిపోలో ఉన్న సర్వీసులకు తగినట్లు గతంలో రూపొందించిన సమయం ప్రకారం బస్సులను నడిపిస్తున్నాం. ప్రస్తుతం వాటిని మార్పు చేయడం కుదరదు. సమయం మారిస్తే ఇతర బస్సులకు ఇబ్బందులు ఏర్పడుతాయి. కొత్త బస్సులు వస్తే విద్యార్థుల బస్సులకే మొదటి ప్రాధాన్యత ఇచ్చి సరిచేస్తాం.

– లావణ్య, ఆర్టీసీ డీఎం

అసంపూర్తిగా డ్వాక్రా భవనం



తిమ్మారెడ్డిపల్లిలో అసంపూర్తిగా ఆగిన భవనం

మద్దూరు: నిధుల కొరత, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో మండలంలోని పలు ప్రభుత్వ భవనాల నిర్మాణాలు అసంపూర్తిగా నిలిచిపోయాయి. పల్లెర్లలో గతఏళ్ల క్రితం పనులు ప్రారంభించిన డ్వాక్రా మహిళా భవనం నిధుల లేమితో అసంపూర్తిగా నిలిచిపోయింది. తిమ్మారెడ్డిపల్లి పంచాయతీ భవన నిర్మాణానికి ఇందిరా గ్రామీణ పథకం కింద రూ.3 లక్షలతో భవన నిర్మాణం చేపట్టారు. నిధులు మంజూరు కాకపోవడంతో దాన్ని అసంపూర్తిగా వదిలేశారు. దాదాపు 10ఏళ్లకు పైగా గడుస్తున్న నేటికి అలాగే ఉంది. ఈ భవనాన్ని అలాగే వదిలేశారు. గత మూడేళ్ల క్రితం నూతన పంచాయతీ భవనం నిర్మాణం చేశారు. దీంట్లోనే ప్రస్తుతం పంచాయతీ కార్యాలయం కొనసాగుతుంది. ఈ భవనాలకు నిధులు మంజూరుచేసి పనులు పూర్తిచేయాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థిక సాయం అందిస్తున్న స్నేహితులు

నారాయణపేట రూరల్: మండలంలోని తిర్మలాపూర్ గ్రామానికి చెందిన కావలి అనిల్ అనారోగ్యంతో మృతి చెందాడు. అయితే ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించడానికి వచ్చిన తోటి స్నేహితులు వారి ఆర్థిక ఇబ్బందులను గుర్తించారు. వెంటనే తలా ఇన్ని డబ్బులు పోగుచేసి భార్య లక్ష్మికి రూ.36వేలు అందించారు. కార్యక్రమంలో అంజి, నరేష్, శ్రీకాంత్, జగదీష్, శ్రీశైలం పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక



ఎంపికైన శ్రీకాంత్, అరుణ్

ధన్వాడ: రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు గిరిజన గురుకుల విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ నెల 28నుంచి 31 తేదీ వరకు మహబూబ్‌నగర్ జిల్లా స్టేడియం గ్రౌండ్‌లో నిర్వహించనున్న 43వ రాష్ట్ర స్థాయి జూనియర్ ఖోఖో పోటీలకు స్థానిక కొండాపూర్ గిరిజన గురుకులంలో చదువుతున్న శ్రీకాంత్, అరుణ్ ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్ కోచ్ డాక్టర్ రామ్మోహన్‌గౌడ్ తెలిపారు. ఈ మేరకు.. ప్రిన్సిపాల్ రాజారాం, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, సాంబయ్యనాయక్‌లు అభినందనలు తెలియజేశారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి రాములు

మహబూబ్‌నగర్ న్యూటౌన్: అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ.రాములు డిమాండ్ చేశారు. పట్టణంలో సీపీఎం 9వ మహాసభలను పార్టీ కార్యాలయంలో సీనియర్ నాయకులు కిల్లె గోపాల్‌తో కలిసి ప్రారంభించారు. పట్టణంలో పేదలు పక్కా ఇళ్లు లేక ఇబ్బందులు పడుతున్నారని, సర్వే నెంబర్ 523 లో పట్టాలు కోల్పోయిన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. టీడీగుట్ట, తిమ్మసానిపల్లి, బోయపల్లి గేట్ల అండర్ గ్రౌండ్‌లైన్ బ్రిడ్జిలు ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు.

ఒకే దేశం ఒకే ఎన్నికను వ్యతిరేకించండి


బీజేపీ, ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వ ప్రతిపాదన ఒకే దేశం ఒకే ఎన్నికను వ్యతిరేకించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ.రాములు పిలుపునిచ్చారు. పార్లమెంటు, అసెంబ్లీ, స్థానిక సంస్థల ఎన్నికలను ఒకేసారి ని ర్వహించాలన్న రాంనాథ్ కోవింద కమిటీ సిఫార్సులను కేంద్ర క్యాబినెట్ ఆమోదించిందన్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు చంద్రకాంత్, వి.పద్మ, మోహన్, రాజ్‌కుమార్, వర్దగాలెన్న, తదితరులు పాల్గొన్నారు.

ముడా చైర్మన్‌కు సన్మానం



మరికల్: మహబూబ్‌నగర్ ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్‌ను ఆదివారం యాదవ సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. యాదవులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను వారు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు ఆయన సానుకులంగా స్పందించారు. కార్యక్రమంలో రాష్ట్ర యాదవ సంఘం ఉపాధ్యక్షుడు వెంకటనర్సయ్య, డీఎస్ చైర్మన్ శాంతన్న, ఓబీసీ చైర్మన్ కృష్ణయ్య, ప్రవీణ్, అంజిరెడ్డి, సురేందర్‌రెడ్డి, మొగులప్ప, వెంకటేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

అంబాభవాని వార్షికోత్సవాలు



ధన్వాడ: మండల కేంద్రంలోని అంబా భవాని ఆలయంలో వార్షికోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఎనిమిది సంవత్సరాలు పూర్తి కావడంతో ఆదివారం అమ్మవారి విగ్రహానికి ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించి అభిషేకం చేశారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పీఆర్టీయూ గౌరవ అధ్యక్షుడిగా బుచ్చారెడ్డి



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా పీఆర్టీయూ గౌరవ అధ్యక్షుడిగా వట్టిపల్లి బుచ్చారెడ్డి ఎంపియ్యారు. ఈ సందర్భంగా ఆయన హైదరాబాద్‌లో జరిగిన పీఆర్టీయూ సమావేశంలో జిల్లాలోని అన్ని మండలాల నాయకుల ఏకాభిప్రాయం మేరకు రాష్ట్ర అధ్యక్షుడు పింగిళి శ్రీపాల్‌రెడ్డి సమక్షంలో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బుచ్చారెడ్డికి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మదన్‌మోహన్ యాదవ్, సుధాకర్‌రెడ్డిలు శుభాకాంక్షలు తెలిపారు.

జోరుగా ఇసుక అక్రమ రవాణా

- నరిహద్దు గ్రామాల్లో డంపులు
- రాత్రివేళల్లోనే రవాణా
- ప్రభుత్వ ఆదాయానికి గండి
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న పోలీసు, రెవెన్యూ అధికారులు



ఇసుక డంపును సీజ్ చేసిన రెవెన్యూ సిబ్బంది (ఫైల్)

మాగనూర్: మండలంలోని నేరడగం, వర్కూర్, వడ్వాట్, మందిపల్లి , గజ్జరం దొడ్డి తదితర గ్రామాల వాగుల నుంచి జోరుగా ఇసుక అక్రమంగా తరలిస్తున్నారు. ముఖ్యంగా మక్తల్ మండలంలోని పలు వాగు పరివాహక గ్రామాలకు చెందిన కొందరు నిత్యం రాత్రి సమయంలో ట్రాక్టర్లతో ఇసుక తరలిస్తూ ఆయా ప్రాంతాల్లో ఇసుక డంపులు చేసి మరుసటి రోజుకల్లా చేరాల్సిన ప్రాంతానికి చేరవేస్తూ దందా సాగిస్తున్నారు. మరికొందరు ఏజెంట్లుగా మారి ఇక్కడ అధికారులతో బేరాలు చేసుకుని రాత్రి ఇసుక ట్రాక్టర్ల ద్వారా అధిక ధరలకు విక్రయిస్తున్నారు.

వీఆర్‌ఏలకు డ్యూటీలు..

అయితే గతకొద్ది రోజులుగా కొనసాగుతున్న ఇసుక అక్రమ రవాణాపై స్పందించి స్థానిక రెవెన్యూ అధికారులు వాగు పరివాహక ప్రాంతాల్లో రాత్రి సమయంలో వీఆర్‌ఏలకు ప్రత్యేక గస్తీ విధులు ఏర్పాటు చేశారు. అయిన అక్రమ ఇసుక దారులు అవేవి తమకు పట్టనట్లు కొత్తపుంతలు తొక్కుతూ ఇసుక అక్రమ రవాణా సాగిస్తున్నారు. యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా కొనసాగుతున్న పోలీసులు మాత్రం నిమ్మకు నిరేత్తనట్లుగా వ్యవహరిస్తున్నారని రైతుల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు ప్రత్యేక దృష్టి సారించి ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలని కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం..



మండలంలోని ఆయా గ్రామాల్లో రాత్రి సమయంలో ఇసుక అక్రమ రవాణా కొనసాగుతున్న విషయం వాస్తవమే. మక్తల్, మాగనూర్ మండలాల పరిధిలో వాగు ప్రవాహం ఉండటంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. సరైన రక్షణ లేక వీఆర్‌ఏలు భయబ్రాంతులకు గురవుతున్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లి అక్రమ రవాణాను అడ్డుకుంటాం.

–సురేష్, ఇన్‌చార్జి, తహసీల్దార్ మాగనూర్

ఘనంగా సీపీఎం మహాసభలు



బొమ్మన్‌పాడులో పార్టీ జెండావిష్కరిస్తున్న నాయకులు



దామరగిద్దలో కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

నారాయణపేట రూరల్: సీపీఎం మండల మూడో మహాసభలు ఆదివారం బొమ్మన్‌పాడులో ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీ రాష్ట్రకార్యవర్గ సభ్యులు సాగర్ ముఖ్యఅతిథిగా హాజరై పార్టీ జెండాను ఆవిష్కరించి సమావేశంలో మాట్లాడారు.. కమ్యునిస్టుల పోరాటాలతోనే సమాజంలో మార్పు వస్తుందని, అభివృద్ధికి బాటలు పడుతున్నాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై కమ్యునిస్టు పార్టీలు ఎన్నో ఉద్యమాలు చేశాయని గుర్తుచేశారు. కార్యక్రమంలో బలరాం, బాలప్ప, దస్తప్ప, కాశప్ప, నరహరి పాల్గొన్నారు.

దామరగిద్ద: సీపీఎం జిల్లా మహాసభకు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి అంజిలయ్యగౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని ముస్తాపేట్‌లో మహాసభల కరపత్రాలను విడుదల చేశారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడుతూ.. నవంబర్ 3, 4 తేదీల్లో మక్తల్ నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించనున్న మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కృష్ణా, వికారాబాద్ రైల్వేలైన్, పేట కోడంగల్ ఎత్తిపోతల పథకం పనులను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు అందించాలన్నారు. సీపీఎం మండల, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



పూర్వ ఉపాధ్యాయులతో విద్యార్థులు

దామరగిద్ద: మండలంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుకున్న 1985–86 సంవత్సరంలో పదోతరగతి చదవుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ మేరకు.. తమకు విద్యాబుద్దులు నేర్పిన పూర్వ ఉపాధ్యాయులను శాలువాతో సన్మానించారు. ఉపాధ్యాయులు జనార్ధన్‌రెడ్డి, చందులాల్, వెంకటేశ్వర్లు మొగులప్ప, శ్రీనివాస్, సాయిరెడ్డిలు మాట్లాడుతూ.. తాము చదువునేర్పిన నాటి విద్యార్థులు నేడు వివిధ రంగాల్లో ఉన్నత స్థానాల్లో ఉండటంపై సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు సన్మానం



ఉద్యోగులను సన్మానిస్తున్న కాలనీవాసులు

ఊట్కూరు: మండలంలోని శ్రీరాంనగర్‌లో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించన వారికి ఆదివారం కాలనీవాసులు సన్మానించారు. ఈ మేరకు.. 2024 సంవత్సరంలో వివిధ శాఖలలో ఏడుగురు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. దీంతో గ్రామస్తులు వీరికి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ కొండన్‌గోపాల్, ఉపాధ్యాయులు నర్సింగప్ప, నారాయణ, గురునాథ్, రాధకృష్ణ, నాయకులు శ్రీనివాస్, ఆజమ్మ, హన్మంతు, నారాయణ పాల్గొన్నారు.

ప్రతి గ్రామంలో గోపాష్టమి నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నరసింహామూర్తి

స్టేషన్ మహబూబ్‌నగర్: దీపావళి పండుగ తర్వాత వచ్చే గోపాష్టమిని ప్రతి గ్రామంలో నిర్వహించాలని విశ్వహిందూ పరిషత్ తెలంగాణ ప్రాంత అధ్యక్షులు బి.నరసింహామూర్తి అన్నారు. జిల్లా కేంద్రం తెలంగాణ చౌరస్తాలో గల గణేష్ భవన్‌లో ఆదివారం వీహెచ్‌పీ ప్రజాధికారుల సమావేశం నిర్వహించారు. గోపాష్టమి రోజు ప్రతి హిందూ కుటుంబం గోపూజలు నిర్వహించాలని కోరారు. జిల్లా అధ్యక్షులు మద్ది యాదిరెడ్డి మాట్లాడుతూ జిల్లా కమిటీ ఇచ్చే ప్రతి కార్యక్రమాన్ని గ్రామ కమిటీలు నిర్వహించాలన్నారు. బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో వచ్చే డిసెంబర్ 11న శౌర్య దివాస్ పేరుతో కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి నలిగేశి లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

రైతులు అధిక దిగుబడి సాధించవచ్చు



పంటలపై అవగాహన కల్పిస్తున్న ఆగ్రో రైతుసేవా కేంద్రంవారు

కోయిల్‌కొండ: రైతులు వ్యవసాయ రంగంలో సిరి పెరల్ సిరిసిడ్స్ విత్తనాల ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చని ఆ సంస్థ ఆర్‌ఎం అమర్నాథ్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని అంకిళ్ల గ్రామంలో ఆగ్రో రైతుసేవా కేంద్రం మరికల్ వారి ఆధ్వర్యంలో రైతు ప్రదర్శన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రైతులకు వ్యవసాయ పంటలపై సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో రైతులు మోహన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, రవి నాయక్, నందు, సాయిబాబు, గోవిందుయాదవ్, చెన్నయ్య, చెన్నప్ప, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల విశ్వాసం కోల్పోయిన ప్రభుత్వం

స్టేషన్ మహబూబ్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగస్తుల విశ్వాసం కోల్పోయిందని ఆల్ మైనార్టీ ఎంప్లాయిస్ వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు షేక్ ఫారుఖ్ హుస్సేన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గత ప్రభుత్వం ఉద్యోగ వైఖరిని ప్రస్తుత ప్రభుత్వం అవలంభిస్తోందని, ఉద్యోగస్తుల ఆర్థిక పరమైన సమస్యలు పరిష్కరించకుండా జఠిలం చేయడం సరికాదని పేర్కొన్నారు. వెంటనే ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక సమస్యలు పరిష్కరించాలని ఆయన కోరారు.

పట్టణ అభివృద్ధికి సహకరించాలి

- మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్



వెంకటరమణ కాలనీలో మురుగును పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆనంద్ కుమార్‌గౌడ్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పట్టణ అభివృద్ధిని మరింత ముందుకు తీసుకుపోయేలా అందరం కలిసి అడుగులు వేద్దామని మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ అన్నారు. ఆదివారం పదో వార్డు పరిధిలోని వెంకటరమణ కాలనీలో పర్యటించారు. డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేదని, మట్టి రోడ్లే ఉన్నాయని కాలనీ వాసులు ఫిర్యాదు చేశారు. ఈ ప్రాంతం భూత్పూర్ మెయిన్ రోడ్డు కంటే కిందికి ఉండటంతో ఎక్కడికక్కడ మురుగు గుంటలుగా ఏర్పడి, ముళ్లపొదలతో నిండి పోయాయన్నారు. దీనికి చైర్మన్ స్పందించి త్వరలోనే డ్రెయినేజీల తోపాటు సీసీ రోడ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. అంతకుముందు టీడీగుట్టలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గద్వాల చంద్రశేఖరరావుతో ఆలపించే అన్నమాచార్యుల 54వ సంకీర్తనల కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు సాయిబాబు పాల్గొన్నారు.